క్యాన్సర్ ఈ వ్యాధి పేరు వింటే చాలు, కాళ్లు చేతులు వణికిపోతాయి. ఈ వ్యాధిని గుర్తించిన మొదలు.. చికిత్స పూర్తయ్యే వరకు నరకయాతన అనుభవించాలి. ట్రీట్మెంట్ తర్వాత కూడా ఎన్నో సమస్యలను ఎదుర్కోవాలి. తిరిగి ఆరోగ్యవంతులు కావాలంటే ఎంత సమయం పడుతుందో కూడా చెప్పలేం. క్యాన్సర్ ప్రాణాలను సైతం బలితీసుకుంటుంది. రొమ్ము, ఊపిరితిత్తులు, చర్మం, గొంతు.. ఇలా శరీరంలోని వివిధ అవయవాలకు ఈ వ్యాధి సోకుతుంది. మన దేశంలో క్యాన్సర్ వ్యాధి గురించి, దాని లక్షణాల గురించి ఇప్పటికి చాలామందికి అవగాహన లేదు. ముదిరిన దశలో వ్యాధిని గుర్తించడం వల్ల పరిస్థితి చేజారుతోంది. కొన్ని లక్షణాలను బట్టి క్యాన్సర్ వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తించడానికి వీలుంది. నేడు (ఫిబ్రవరి 4) ప్రపంచ క్యాన్సర్ దినం నేపథ్యంలో క్యాన్సర్ అంటే ఏమిటీ? ఎలా ఏర్పడుతుంది? ఏయే క్యాన్సర్లను ఎలా గుర్తించాలి తదితర అంశాలపై కెరటం న్యూస్ అందిస్తోన్న ప్రత్యేక కథనం..

కొత్తగూడెం, ఫిబ్రవరి03(కెరటం ప్రతినిధి)



# కృంగిపోవద్దు..


- మానవాళిని కబళిస్తోన్న మహమ్మారి క్యాన్సర్...
- ప్రపంచ వ్యాప్తంగా 1.3కోట్ల మంది మరణం
- 2026 నాటికి భారతదేశంలో ప్రతీ ఏటా 20లక్షల మందికి మరణిస్తారని అంచనా
- అవగాహనతో ఆరోగ్యం కాపాడుకోవాలంటున్న వైద్యులు

# కట్టడి చేద్దాం..

## నేడు ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం

**కుంగిపోవద్దు క్యాన్సర్ కట్టడి చేద్దాం..**

క్యాన్సర్ వ్యాధి ప్రపంచ వ్యాప్తంగా మానవాళిని కబళిస్తోంది. సైన్స్ పరంగా ఎంత అభివృద్ధి చెందుతున్నా..క్యాన్సర్ మరణాలు, వ్యాది తీవ్రత తగ్గడం లేదు. 2015లో ప్రపంచవ్యాప్తంగా దాదాపు 90.5 మిలియన్ల మందికి క్యాన్సర్ వచ్చింది. 2019లో, వార్షిక క్యాన్సర్ కేసులు 23.6 మిలియన్ల మంది పెరిగాయి. ప్రపంచవ్యాప్తంగా 10 మిలియన్ల మరణాలు సంభవించాయి, ఇది గత దశాబ్దంలో వరుసగా 26శాతం పెరుగుదలను సూచిస్తుంది. మొత్తం మీద చాపకింద నీరులా యావత్ ప్రపంచాన్నే చుట్టేస్తున్న క్యాన్సర్పై మానవుడు నిత్యం పోరాడుతూనే ఉన్నాడు. మరీ బాధాకరమైన విషయం ఏమంటే ప్రపంచ వ్యాప్తంగా చిన్నారులు సైతం లక్షల్లో క్యాన్సర్ బారిన పడటం ఆందోళన కలిగిస్తోంది. పురుషులలో అత్యంత సాధారణమైన క్యాన్సర్ రకాలుగా ఊపిరితిత్తుల క్యాన్సర్, ప్రోస్టేట్ క్యాన్సర్, కొలొరెక్టల్ క్యాన్సర్, కడుపు క్యాన్సర్. స్త్రీలలో, అత్యంత సాధారణ రకాలు రొమ్ము క్యాన్సర్,



కొలొరెక్టల్ క్యాన్సర్, ఊపిరితిత్తుల క్యాన్సర్, మరియు గర్భాశయ క్యాన్సర్. ప్రతి సంవత్సరం మొత్తం కొత్త క్యాన్సర్ కేసులలో మెలనోమా కాకుండా ఇతర చర్మ క్యాన్సర్లను చేర్చినట్లయితే, ఇది దాదాపు 40శాతం కేసులకు కారణం అవుతుంది. పిల్లలలో, తీవ్రమైన లింఫోబ్లాస్టిక్ లుకేమియా మెదడు కణితులు సర్వసాధారణం, ఆఫ్రికాలో తప్ప, హాడ్కిన్ కాని లింఫోమా ఎక్కువగా సంభవిస్తుంది. 2012లో 15 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న 165,000 మంది పిల్లలు క్యాన్సర్తో బాధపడుతున్నారు. వయస్సుతో పాటు క్యాన్సర్ ప్రమాదం గణనీయంగా పెరుగుతుంది. అభివృద్ధి చెందిన దేశాలలో చాలా క్యాన్సర్లు ఎక్కువగా సంభవిస్తాయి. ఎక్కువ మంది ప్రజలు వృద్ధాప్యం వరకు జీవిస్తున్నందున అభివృద్ధి చెందుతున్న దేశాలలో జీవనశైలి మార్పులు సంభవిస్తున్నందున అనేక రేట్లు పెరుగుతున్నాయి.

**భారతదేశం లో ఈ వ్యాధి గ్రస్తులు**

క్యాన్సర్ భారతదేశంలో 2020 సంవత్సరంలో 13.92 లక్షలు మంది ప్రజలు క్యాన్సర్ బారిన పడగా, 2021 సంవత్సరంలో 14.26 లక్షల మంది, 2022 సంవత్సరం లో 14.61 ప్రజల మంది ఈ మహమ్మారీ వ్యాధిలో నమోదు అయ్యారు. మన దేశంలో క్యాన్సర్ మరణాల సంఖ్య 2018 సంవత్సరంలో 7.33 లక్షల సంఖ్యలో మరణాలు జరిగినవి. ఆ మరణాలు 2022 సంవత్సరంలో 8.08 లక్షల మంది ప్రజలు చనిపోయారు. అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ, ఢిల్లీ (ఎయిమ్స్) నివేదికలో పేర్కొన్న ప్రకారం 2026 సంవత్సరానికి ఈ క్యాన్సర్ మరణాల సంఖ్య ప్రతి సంవత్సరం 20 లక్షలలో ప్రజలు మరణిస్తారని తెలిపింది. ఈ వ్యాధి నిరోధమునకు ప్రాథమిక దశలోనే గుర్తిస్తే, ఈ వ్యాధిని కొంత వరకు తగ్గుముఖం పట్టవచ్చని తెలిపింది.

## క్యాన్సర్పై అవగాహన కల్పిద్దాం..



శరీరం మొత్తం కణజాలంతో నిండి ఉంటుంది.. శరీరంలో ఎక్కడైనా కణజాలం అవసరం లేకుండా విపరీతంగా పెరిగిపోవడమే క్యాన్సర్ అని అమృత మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ అధినేత, ప్రముఖ పల్మనాలజిస్ట్ వైద్య నిపుణులు డాక్టర్ బాబురావు అన్నారు. సాధారణంగా శరీరంలో కణాల విభజన జరుగుతుంది. ఇలా ప్రతి కణం విభజనకు గురై పుడుతూ చనిపోతూ ఉంటాయి. అయితే, శరీరంలో ఈ ప్రక్రియకు విఘాతం ఏర్పడితే కొన్ని కణాలు చనిపోకుండా అలాగే ఉండిపోతాయి. కణాల్లో ఉండే డీఎన్ఏలో మార్పుల వల్లే ఈ పరిస్థితి ఏర్పడుతుంది. ఆహారపు అలవాట్లు, రేడియేషన్, స్మోకింగ్, ఊబకాయం తదితర కారణాల వల్ల కూడా డీఎన్ఏలో మార్పులు వస్తాయి. బ్రెస్ట్ క్యాన్సర్ (రొమ్ములు), స్కిన్ క్యాన్సర్ (చర్మం), లంగ్ క్యాన్సర్ (ఊపిరితిత్తులు), ప్రోస్టేట్ క్యాన్సర్ (మూత్రాశయం), కొలోన్ లేదా రెక్టం క్యాన్సర్ (పెద్ద పేగు భాగం), కిడ్నీ క్యాన్సర్ (మూత్రపిండాలు), బ్లడ్ క్యాన్సర్ (రక్తం), సర్వైకల్ క్యాన్సర్ ముఖ్యమైనవని డాక్టర్ బాబురావు తెలిపారు.

- డాక్టర్ బాబురావు, ప్రముఖ వైద్యులు, కొత్తగూడెం

## అపోహల వల్లే క్యాన్సర్ నిర్ధారణ ఆలస్యం..



మన శరీరంలో కణ విభజనలు ఒక క్రమ పద్ధతిలో జరుగు తాయి. అయితే, కొన్ని కారణాల వల్ల, ఆ కణాలు నియంత్రణ కోల్పోయి, చాలా వేగంగా, అస్తవ్యస్తంగా విభజన చెంది కణ సమూహాలను ఏర్పరుస్తాయి. ఆ స్థితిని క్యాన్సర్ అంటారని, ఈ కణ సమూహాలను 'కణితి'( ట్యూమర్) అని పిలుస్తారని వీ-కేర్ మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ అధినేత, ప్రముఖ వైద్యులు డాక్టర్ మహమ్మూద్ పాషా అన్నారు. దేశంలో అత్యధిక మరణాలకు కారణమవుతున్న వ్యాధుల్లో మొదటి స్థానం గుండె జబ్బులది కాగా, ఆ తరవాత స్థానం క్యాన్సర్దే. మన దేశంలో క్యాన్సర్ బాధితుల్లో ప్రతి ముగ్గురిలో ఇద్దరికి, వ్యాధి ముదిరిన తరవాతే ఇది నిర్ధారణ అవుతోంది. దీంతో బతికే అవకాశాలు తగ్గిపోతున్నాయి. అవగాహన లేక పోవడం, నిరక్షరాస్యత, భయం, వివిధ రకాల అపోహల వల్లే క్యాన్సర్ నిర్ధారణ ఆలస్యం అవుతోంది. రొటీన్ స్క్రీనింగ్, ముందుగానే గుర్తించడం, తొలి దశలోనే చికిత్స చేయడం ద్వారా క్యాన్సర్ మరణాల్లో దాదాపు మూడింట ఒక వంతును అడ్డుకోవచ్చు.

- ప్రముఖ వైద్యులు డాక్టర్ మహమ్మూద్ పాషా

## తెలియకుండానే పెరిగిపోతున్న క్యాన్సర్..



క్యాన్సర్ను అధిగమించేందుకు అందరం కలిసి అవగాహన కల్పిద్దామని ప్రముఖ వైద్యులు డాక్టర్ వేణుగోపాల్ అన్నారు. భారతదేశంలో తెలియకుండానే పెరిగిపోతుంది. మారిన జీవనశైలి మరియు వివిధ రకాల ఆహారపు అలవాట్ల వల్ల పురుషులు, మహిళలు అనే లింగభేధం లేకుండా ప్రస్తుతం చాలా మంది అనేక రకాల క్యాన్సర్ల బారిన పడుతున్నారు. క్యాన్సర్ ఎవరికి ఎప్పుడు, ఎందుకు, ఎలా వస్తుందో చెప్పలేము. క్యాన్సర్ శరీరంలోని ఏ భాగంలోనైనా రావొచ్చు. నోరు, ఛాతీ, ఊపిరితిత్తులు, గొంతు, స్వరపేటిక, రొమ్ము, శ్వాసకోశ, ప్రోస్టేట్, పేగు, జీర్ణశయ, కాలేయ క్యాన్సర్ ల వంటి దాదాపు 100కు పైగా క్యాన్సర్ రకాలు ఉన్నాయి. క్యాన్సర్ బారిన పడిన చాలా మందిలో నిరక్షరాస్యత మరియు క్యాన్సర్ పై సరైన అవగాహన లేకపోవడంతో వ్యాధి తీవ్రత పెరిగి ప్రాణాలు సైతం కోల్పోతున్నారు. దీనిపై విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

ప్రముఖ వైద్యులు డాక్టర్ వేణుగోపాల్